

కొరిపెల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..

**మాజీ మంత్రి దయాకర్‌రావు**

పెద్దవంగర, ఫిబ్రవరి 27 : అధైర్యపడొద్దు.. ప్రతి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం కొరిపెల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు మట్టిపల్లి మహేశ్ అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చి ఆర్థిక సాయం చేశారు. అలాగే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త జంపాల బాలమ్మ ఇటీవల మృతి చెందగా, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, నాయకులు సునీల్‌కుమార్‌రెడ్డి, సుధీర్‌కుమార్, వెంకన్న, జ్ఞానేశ్వరాచారి, వెంకట్‌రెడ్డి, భీమానాయక్ పాల్గొన్నారు.

**తొర్రూరులో..**

తొర్రూరు : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తొర్రూరు పట్టణ శారదా స్కూల్ కరస్పాండెంట్, మాజీ లయన్స్ క్లబ్ గవర్నర్ లక్ష్మీనరసింహారావును గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పట్టణానికి చెందిన నాగరాజు ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకోగా, ఆయనను కూడా పరామర్శించారు. దయాకర్‌రావు వెంట మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, సీనియర్ నాయకుడు సోమేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అంజయ్య, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వీరన్నకు జాతీయ ఉత్తమ రైతు అవార్డు



ఉత్తమ రైతు అవార్డు అందుకున్న వీరన్న

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ గురువారం ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ హార్టికల్చర్ ఫెయిర్‌లో మండలంలోని మల్యాల గ్రామ శివారు మేఘ్యతండాకు చెందిన మిర్చి రైతు బోడ వీరన్న జాతీయ ఉత్తమ రైతు అవార్డ్‌ను అందుకున్నట్లు మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త నాగరాజు తెలిపారు. 2024లో ఖరీఫ్‌లో షెడ్యూల్డ్ తెగల ఉపప్రణాళికలో భాగంగా భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ వారు అభివృద్ధి చేసిన అర్క తేజస్వి మిరప రకాన్ని జేవీఆర్ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తల సహకారంతో సాగు చేసి ఎకరానికి 30క్వింటాళ్ల దిగుబడి సాధించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ ఎంపిక చేసిన 14 మంది ఉత్తమ ఉద్యాన రైతుల్లో బోడ వీరన్న ఒకరని తెలిపారు. మిరప రైతులకు వీరన్న ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

## మహిళలపై దాడులను అరికట్టాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : దేశంలో మహిళల దాడులు అరికట్టేందుకు పోరాడాలని ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పద్మ అన్నారు. గురువారం పట్టణంలోని బట్టు అంజయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా దళితులు, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు ఎక్కువగా దాడులకు గురవుతున్నారని, 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు పెరిగి పోయాయన్నారు. మార్చి ఒకటి నుంచి 8 వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతమ్మ, కృష్ణవేణి, యాకమ్మ, శారద, కవిత, రమ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

PASSPORT MISSING

★ I, Mohammed Anwer S/o Late Yakub Ali, R/o H.No. 2-9-1232, Waddepally, Hanumakonda Dist. I lost my Passport. Passport No. H0389081 While Travelling by Bike from Waddepally to Subedari. So if found Please let me know Contact Cell: 7330516331.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565






తాళిబొట్టును చూపుతున్న అర్చకుడు

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

మహాశివరాత్రి పురస్కరించుకొని కురవి మండల కేంద్రంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం బుధవారం అర్ధరాత్రి తర్వాత అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని వీక్షించి తరించిపోయారు. శాస్త్రోక్తంగా అర్చకులు వివాహతంతును నిర్వహించారు. – కురవి

# సుందరీకరణ ముందుకు సాగేనా?

- పెద్దచెరువు కట్టపై కలగానే మినీ ట్యాంక్‌బండ్..?
- సగానికి కోతకు గురైన చెరువు కట్ట
- పంట పొలాలకు పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు

తొర్రూరు, ఫిబ్రవరి27 : తెలంగాణ రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన చెరువుల సుందరీకరణ పనులు ముందుకుసాగడం లేదు. చెరువుల వద్ద మినీ ట్యాంక్‌బండ్‌లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక చెరువును హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తొర్రూరు పురపాలక సంఘంలోని పెద్ద చెరువు కట్టపై మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధికి 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ.3.60 కోట్లు మంజూరు చేసింది. వీటితో కట్ట, మత్తడి మరమ్మతు, బతుకమ్మ ఘాట్, వంతెన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే, రూ.2.19 కోట్లతో వంతెన కోసం కేవలం దిమ్మెల నిర్మాణం మాత్రమే చేశారు.. మిగిలిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కాగా, ఈ పనులను స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి నిలిపివేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు. పెద్దచెరువు కట్ట మరమ్మతు పనులు పూర్తికాక పోవడంతో కట్ట కింద ఉన్న 600 ఎకరాల ఆయకట్టుకు ప్రమాదం పొంచి ఉన్నది. గత వానకాలంలో కురిసిన వర్షాల కారణంగా చెరువు కట్ట సగానికి కోతకు గురవడం ఆయకట్టు పరిధిలో రైతులకు ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు వెంటనే స్పందించి కట్ట వెడల్పు పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. కేవలం ఎర్రబెల్లి దయాకర్‌రావుపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ పనులు నిలిపివేశారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.



తొర్రూరు పెద్ద చెరువులో నిరుపయోగంగా వంతెన దిమ్మెలు

**సుందరీకరణ పనుల పరిస్థితి ఏంటి..?**

చెరువు కట్టకు ఇరువైపులా వాకింగ్ ట్రాక్, వీధి దీపాలు, బెంచీలు, మినీ గార్డెన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినా, ఇప్పటి వరకు కేవలం ముళ్ల చెట్లు తొలగింపు తప్పా.., ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. పనులు నిలిచిపోయి నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారుల్లో స్పందన లేకపోవ డం ప్రజల్లో అసంతృప్తిని కలిగిస్తున్నది. పరిరక్షణ పనులు జరగకపోతే భవిష్యత్‌లో భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభు త్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిలిచిన పనులను పునః ప్రారంభించి పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## చెరువు కట్ట మీద నుంచి జారి పడి మృతి

గార్ల, ఫిబ్రవరి 27: గార్ల పెద్ద చెరువు కట్ట మీద నుంచి జారి పడి ఒకరు మృతి చెందిన ఘటన గురువారం సీతంపేటలో జరిగింది. ఎస్సై రియాజ్ పాషా కథనం ప్రకారం.. బయ్యారం గ్రామానికి చెందిన కత్తి జంపన్న (47)కు బుధవారం రాత్రి గార్లకు చెందిన శివ సీతంపేట చెరువు అలుగు వద్ద పార్టీ ఇచ్చాడు. జంపన్న పార్టీ ముగించుకొని స్కూటీపై తిరిగి వెళ్తున్న క్రమంలో కాలు జారి 13ఫీట్ల ఎత్తు నుంచి అలుగుపై పడ్డాడు. దీంతో జంపన్నకు బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి జంపన్న మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



జంపన్న (ఫైల్)



కురవి: తాత్కాలిక బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ శివప్రసాద్

## సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు

కురవి/మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : మహాశివరాత్రి పండుగ సందర్భంగా కురవి జాతర విజయవంతానికి కృషి చేసిన ఆర్టీసీ సిబ్బంది, సహకరించిన వివిధ శాఖల అధికారులకు మహబూబాబాద్ డిపో మేనేజర్ ఎం శివ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. జాతర సందర్భంగా 26న నేరడ క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్ నుంచి 20 స్పెషల్ బస్సులతో 207 ట్రిప్పులు నడిపినట్లు తెలిపారు. 5,236 కిలోమీటర్లు నడిపి, 14,467మంది ప్రయాణికులను చేరవేయడం ద్వారా సంస్థకు రూ.4,16,592ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతరను విజయవంతం చేసిన కండక్టర్లు, డ్రైవర్లు, డిపో ఉద్యోగులు, సహకరించిన వివిధ శాఖల ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

**జిల్లాలో 94.47 శాతం పోలింగ్**

మహబూబాబాద్ (నమస్తే తెలంగాణ), ఫిబ్రవరి 27: నల్లగొండ- ఖమ్మం- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జిల్లాలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయులు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో మొత్తం 1663 మంది ఓటర్లు ఉండగా 94.47శాతం మంది తమ ఓటు వేశారు. గురువారం ఎన్నికలు ఉండడంతో జిల్లా యంత్రాంగం బుధవారం మధ్యాహ్నం వరకే పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలతో చేరుకున్నారు. సిబ్బందిని ప్రత్యేక బస్సుల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 పోలింగ్ కేంద్రాలకు తరలించారు. గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం 4 గంటల తర్వాత ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. 16 పోలింగ్ కేంద్రాల్లో 1,663 ఓట్లకు 1,571 (94.47 శాతం) ఓట్లు పోలయ్యాయి. ఉదయం 10 గంటల వరకు 12.81శాతం, మధ్యాహ్నం 12గంటల వరకు 47.50శాతం, మధ్యాహ్నం 2గంటల వరకు 78.89 శాతం, సాయంత్రం 4 గంటల వరకు మొత్తం 94.47శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ పరిశీలించి, ఆర్వోలకు సూచనలు చేశారు.



మహబూబాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



తొర్రూరు: ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు



కురవి: మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులు

## మృతదేహంతో ధర్నా

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్**

కురవి, ఫిబ్రవరి 27 : మండలంలోని రాజోలు గ్రామంలో విద్యుదాఘాతంతో పాశం మల్లయ్య బుధవారం రాత్రి మృతిచెందారు. గ్రామానికి చెందిన సూపర్‌మార్కెట్ యజమాని అజాగ్రత్తతో ఏర్పాటు చేసిన విద్యుత్ ఎర్త్ వైర్ వల్లనే మల్లయ్య మృతిచెందాడని ఆరోపిస్తూ షాపు ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ కుటుంబసభ్యులు, గ్రామస్తులు కలిసి డోర్నకల్, మహబూబాబాద్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. గ్రామస్తులు చివరికి షాపు యజమానితో మాట్లాడి కొంత నష్టపరిహారం ఇప్పించినట్లు తెలుస్తున్నది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.



అశ్విని థియేటర్ సమీపంలో చీకటిగా మారిన హైవే

## అంధకారంలో తొర్రూరు మున్సిపాలిటీ..?

తొర్రూరు : తొర్రూరు పట్టణంలో రాత్రి సమయాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. ముఖ్యంగా అశ్వినీ థియేటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు అంధకారం ఉండడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని, దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## పురాతన ఆలయాల సందర్శన

నెల్లికుదురు, ఫిబ్రవరి 27 : మండలంలోని రాజుల కొత్తపల్లి గ్రామంలో గురువారం పురావస్తుశాఖ అధికారి బాబు పురాతన ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని వేణుగోపాలస్వామి, బాలాజీ ఆలయాలు 11వ శతాబ్దానికి చెందినవని, పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడంతోపాటు పురాతన ఆలయాల చరిత్రను వెలుగులోకి తేవడానికి తనవంతు సాయం చేస్తానని తెలిపారు.



పురాతన ఆలయం వద్ద అధికారి బాబు

## అక్రమ దత్తత చట్టరీత్యా నేరం

కురవి, ఫిబ్రవరి 27 : దత్తత పేరుతో పిల్లలను అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. కురవి మండల కేంద్రంలో మహాశివరాత్రి సందర్భంగా ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అక్రమ దత్తతపై ముద్రించిన కరపత్రాలను సంత ఆవరణలో డీపీవో హరిప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. చట్టవిరుద్ధంగా పిల్లలను పెంచుకోవడం, దత్తత ఇవ్వడం నేరమని, తీసుకున్నవారికి, ఇచ్చిన వారికి మూడేళ్ల శిక్ష పడుతుందన్నారు. అమ్మినట్లు రుజువైతే ఐదేండ్ల శిక్ష పడుతుందన్నారు. ఎంపీడీవో బాలరాజు, మిషన్ భగీరథ ఏఈ కృష్ణారెడ్డి, దివాకర్, వైద్యసిబ్బంది కుమారి, దేవి, విజయ, జ్యోతి, శోభ పాల్గొన్నారు.

## రేపు అమరవీరుల దినోత్సవం

మహబూబాబాద్ రూరల్ : మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, చట్టబద్ధత కోసం త్వరలో లక్ష డప్పులు, వేల గొంతులు'కార్యక్రమం ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో మాదిగ ఉప కులాల పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో శ్రీను, యాకయ్య, ప్రవీణ్, ఎండీ పాషా, వెంకన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మహబూబాబాద్ రూరల్ : విద్యార్థులు తార్కిక ఆలోచన పెంచుకోవడం ద్వారా పరిశోధనలు చేయడానికి ప్రేరణ కలుగుతుందని కేంద్రీయ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ముఖేశ్‌కుమార్ అన్నారు. గురువారం పాఠశాలలో సైన్స్ ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనల ద్వారా తమ సమయాన్ని ప్రయోగశాలలో గడిపే అవకాశాలు ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇమాముద్దీన్, భాస్కర్, రితేశ్, మొసిన్ పాల్గొన్నారు.

## బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

మహబూబాబాద్ రూరల్ : సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నేటి నుంచి మార్చి 2 వరకు జరుగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీలకు పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మందుల శ్రీరాములు తెలిపారు. ఎంపికైన భూక్యా బిందు, మంజునాథ్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

**నేరడ జడ్పీ హైస్కూల్ నుంచి ఏడుగురు**

కురవి, ఫిబ్రవరి 27: మండలంలోని నేరడ జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బాలాజీ, పీఈటీ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 28న నుంచి వచ్చే నెల 2వరకు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మినీ జూనియర్ బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు సుహాసిని, చందన, పవిత్ర, రక్షిత, చరణ్, ఉదయ్‌సాయి, శివ పాల్గొంటారని తెలిపారు.

## రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచాలని జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ కల్లూరి ప్రభాకర్ కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్రస్థాయి పోటీలకు తరలివెళ్తున్న క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, బాలాజీ, ప్రణయ్ పాల్గొన్నారు.

## తునికాకు సేకరణ ప్రభుత్వమే చేపట్టాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : తునికాకు సేకరణను రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 50 ఆకుల కట్టకు రూ.6ల చొప్పున చెల్లించాలని, తునికాకు సేకరణకు సంబంధించిన అన్ని పనులను ప్రభుత్వమే చూసుకోవాలన్నారు. తునికాకు సేకరణలో ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేసియాను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగన్న, నాగేశ్వరరావు, రామచంద్రు, మురళీ, భిక్షం, హనుమంతు, వీరభద్రం పాల్గొన్నారు.

## దాడి కేసులో ఒకరి అరెస్టు

కేసముద్రం, ఫిబ్రవరి 27 : మహిళపై దాడి చేసిన కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై మురళీధర్ రాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మూలస్తంభం గ్రామానికి చెందిన నూనావత్ రమేశ్ ఇంటి స్థలానికి సంబంధించిన గొడవలో తన వదిన రాజీ అనే మహిళపై వేట కొడవలితో దాడి చేశాడు. బాధితురాలు ఈ నెల 26న ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన రమేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ఆజాద్ స్ఫూర్తితో పోరాడాలి

తొర్రూరు ఫిబ్రవరి 27 : చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ నందీశ్వర్ అన్నారు. ఆజాద్ 94వ వర్ధంతి సందర్భంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బానోత్ రామచందర్, బీ రవీందర్, అజ్మీరా సిద్ధు, ధరావత్ నవీన్, మహేశ్, రోహిత్, అంజి పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ సీజ్: ఇద్దరిపై కేసు నమోదు

నెల్లికుదురు : ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర రమేశ్ బాబు గురువారం తెలిపారు. ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సై కథనం ప్రకారం మండల కేంద్రంలో గురువారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఎస్సీ కాలనీ వద్ద ఆకేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుపడింది. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసిన యజమాని కర్నె సాయిలు, డ్రైవర్ గునుగంటి ఉమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**మహబూబాబాద్‌లో రెండు..**

మహబూబాబాద్ రూరల్ : ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం టౌన్ పోలీసులు సీజ్ చేశారు. టౌన్ సీఐ దేవేందర్ కథనం ప్రకారం.. అనుమతులు లేకుండా ఆకేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**నర్సింహులపేటలో ఒకటి..**

నర్సింహులపేట:కౌసల్యదేవిపల్లి గ్రామంలో గురువారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్సై సురేశ్ పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

నర్సింహులపేట : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని అజ్మీరాతండా జీపీ పరిధిలోని వాంకుడోత్ తండాలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కుటుంబ కలహాలతో ఈ నెల 23న తండాకు చెందిన వాంకుడోత్ బుజ్జి( 36) ఒంటికి నిప్పంటించుకోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. బుజ్జిని చికిత్స నిమిత్తం హన్మకొండలోని ప్రైవేట్ దవఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయంపై ఎస్సై సురేశ్ మాట్లాడుతూ.. మహిళ చనిపోయిన విషయం వాస్తవమేనని, ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

## నలుగురిపై కేసు నమోదు

మరిపెడ : వేర్వేరు ఘటనల్లో నలుగురుపై కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్సై సతీశ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. అనుమతి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న మండంలోని చింతలగడ్డ తండాకు చెందిన ఆంగోత్ రవీందర్‌పై, నల్లబెల్లం, పటికతో గుడుంబా తయారు చేసి అమ్ముతున్న నీలికుర్తి గ్రామ శివారు దాస్యతండా చెందిన బానోత్ లాలూ, గూగులోత్ వీరన్న, చిల్లంచర్ల గ్రామ శివారు చందా తండాకు చెందిన అజ్మీరా నరేశ్‌పై పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 1.5 క్వింటాళ్ల నల్లబెల్లం పటికను స్వాధీనం చేసుకొని 200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు.

## చెట్లు నరికితే కఠిన చర్యలు

దంతాలపల్లి, ఫిబ్రవరి 27: అక్రమంగా చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీశాఖ అధికారి విశాల్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దముప్పారం, వేములపల్లి శివారులో నర్సరీలు, రోడ్డు పక్కన నాటిన చెట్లను పరిశీలించి మాట్లాడారు. నాటిన మొక్కలను అనుమతి లేకుండా నరికితే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి విజయలక్ష్మి, సెక్షన్ అధికారి సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.